# బ్రతకనేర్చిన మనిషి

కాలం మింగిన మనస్సుతో బ్రతకడం చేతకాదని పదేళ్ళ క్రిందట లక్ష్మీకాంతం అంటే తెల్లబోయాను.

ఇప్పుడు తెలిసింది మనస్సుని కాలం ఎట్లా మింగుతుందో....

ఎదగని కోరికలాగ, ప్రయత్నించినా నిండుదనాన్ని పొందని నవ్వూ, దయగా, జాలిగా ప్రపంచాన్నంతా క్షమించగల స్థిమితంతో బద్దకంపడే కళ్ళూ అహంకారంతో, పట్టుదలతో వంపుతిరిగిన పెదాలూ, కాస్తపాటి నిర్లక్ష్యం, విచారం లేనితనం, సంతృప్తీ, హాస్యం... వీటి సంకలనం లక్ష్మీకాంతం.

పదేళ్ళ క్రిందట 'కవి' అన్నవాణ్ణి పలకరిస్తే 'అభ్యుదయం కోసం అర్రులు చాస్తున్నాననో', చెలం 'స్త్రీ'కి టీక వ్రాస్తున్నానో చెప్పినట్లు, పదేళ్ళకిందట మరీ చిన్నవాణ్ణయిన నేను 'ఏం చేస్తున్నారం'టే నవ్వి—ప్రపంచాన్నంతా క్షమించగలంత బలమైన నవ్వు నవ్వి – 'బ్రతకడం నేర్చుకుంటున్నాను' అనేవాడు.

కంఠంలో అంత జవం, విశ్వాసం లేకపోతే చాలామంది చాలా మంచి విషయాలు నేర్చుకోబోయి వెనుక పడ్డవారి జాబితాలోనే అతణ్ణి కలిపేసేవాణ్ని. కాని అలాక్కాదు. అతని కళ్ళు చూస్తో, ఆ మాటలు వింటూ 'నిజంగా నేర్చుకుంటున్నాడు కాబోలు' అనుకునే వాణ్ని.

నాకు బాగా జ్ఞాపకం:

"ప్రపంచం కుక్కలాంటిది. బెదురు చూపులు చూస్తే కరిచిపారిపోతుంది, ఎదిరించి నిలబడ్డావా తోక ముడుచుకు పడుకొంటుంది. మళ్ళీ నీవేవన్నా చూడదు" అనేవాడు.

"మరిన్నాళ్ళూ నువ్విలాగే బ్రతుకుతున్నావా?"

"నేను బ్రతకడం లేదు. బ్రతకడం నేర్చుకుంటున్నాను"

ఇదే జవాబును లక్ష్మీకాంతం వెయ్యీన్నీ తొమ్మన్నూట ఆరువందల పదకొండుసార్లు చెప్పగా విన్నాను.

ఒక్కసారి మాత్రం అలా చెప్పలేదు! అదే విచిత్రం. ఆ విషయం చెప్పడానికే ఈ కథంతాను.

* * * *

లక్ష్మీకాంతం ఎప్పుడు పరిచయమయ్యాడో సరిగా గుర్తు లేదు. ఓరోజు రైలు కట్టకి యివతల చెరువు దగ్గర నిలబడితే ఎవరో చూపించారు, దూరాన వెళ్ళిపోతున్న లక్ష్మీకాంతాన్ని. కాళ్ళవరకూ జీరాడుతూ మాసిపోయిన నల్లటి పంచె-- చేతులు కన్పించకుండా వేళ్ళవరకూ వేలాడుతున్న తూట్లు పడిన లాల్చీ, నుదుటిమీద బొట్టు పెట్టినట్టుగా నల్లటి పుట్టుమచ్చ- ఇక నవ్వు- ఆ నవ్వుకి ఒక అర్థం లేదు. ఆ ఒక్క నవ్వులో ప్రపంచమంతా నీ పాదాలముందు నిలబడ్డట్టూ, నీ జీవితానికి అతనొక్కడే ఆప్తమిత్రుడయినట్టూ, ఆ క్షణమే నీ జీవితంలో అమూల్యమయినదిగా మిగిలినట్టూ- ఇలా ఎంతయినా చెప్పుకోవచ్చు ఆ నవ్వు వ్యుత్పత్తిని. చేతులెత్తి విశ్వాసంతో నమస్కారం చేశాడు. రచయితనని విన్నాక మరీ ఆసక్తిని చూపాడు.

"నా పేరు వినలేదా మీరు!- ఆశ్చర్యమే" అన్నాడు నేనేదో పెద్ద నేరం చేసినట్టు చూస్తూ.

"మంచి అంతా అలా వుంచండి. వాటిని పూసుకు తిరగడానికి వేరే మనుషులుంటారు. 'చెడు' ఎక్కడ ఉందో అక్కడ నా పేరు ఉంటుంది" - నే తెల్లబోతే చిన్న కుర్రాణ్ణిలాగా బుజం తట్టి, పక్కనే ఉన్న నా మిత్రునితో అన్నాడు.

"ఈ పేము బెత్తాలెందుకో తెలుసా?" గాలిలో రివ్వుమనేటట్టు రెండుసార్లు ఆడించాడు. చేతిలో ఉన్న వాటిని.

"ఎందుకూ?"

"గీతపనివాడు తెల్సుగా?- సీతప్పన్న- నిన్న- నిన్న రాత్రి పెళ్ళాన్ని జుత్తు పట్టుకు ఈడ్చి, కొట్టి, యింట్లోంచి పొమ్మన్నాడట. కొడుకు పరుగెత్తుకొచ్చాడు. ఆలోచిస్తే ఇదే మంచి మందు కనిపించింది. వస్తాను"

పక్కలకి ఊగుతూ ఊచలా నడుచుకు పోతున్న అతన్ని ఆశ్చర్యంతో చూస్తూ నిలబడ్డాను.

అతన్ని పరిచయం చేసుకోకపోవడంవల్ల నష్టం లేదు. అంతా యాదృచ్ఛికం. తర్వాత మూడు నెలలు కన్పించకపోతే విచారించ లేదు. దాదాపు మరచిపోయేను.

మూడు నెలల తరువాత సినీమానుంచి వస్తూంటే లాంతరు స్తంభం కింద తటస్థపడ్డాడు. నన్ను చూడగానే కెవ్వున కేకవేసి జబ్బపట్టుకున్నాడు.

"ఏమండోయ్! గుర్తు పట్టలేదా నన్ను- కాంతాన్ని!" ఆకలి ప్రాణం తినేస్తోంది.

పది దాటింది. జబ్బ వదిలేస్తే పారిపోదామనిపించింది. మురికిగా ఉన్న అతని చేతులు తాకిన చోట నల్లటి మరక దీపం వెలుగులో స్పష్టంగా కనిపించింది. నేను బాధపడడం చూసి సిగ్గుపడి చేయి వదిలేశాడు.

"నాకేం మర్యాద తెలీదు. క్షమించండి" అని లాంతరు స్తంభానికి చేరగిల బడ్డాడు.

అంతలో సహనం చూపలేకపోయినందుకు నాకే సిగ్గువేసింది.

మురికిగా, అలసిఉన్న అతని ముఖాన్ని చూస్తూ ఎలా క్షమాపణ చెప్పాలో తెలీక తికమకపడ్డాను.

"బావున్నావా?" అన్నాను.

విచిత్రంగా చూశాడు: "ఆ ప్రశ్న నన్నెవరూ అడగరండి, నేను బావుంటానని అందరికీ తెలుసు"

ఇంకేమనాలో తోచలేదు. బీడి వెలిగించి పొగ గుప్పుమని వదిలాడు.

"సీతప్పన్న పెళ్ళాం బావుందా?" అన్నాను ఆ రోజు విషయం గుర్తుకొచ్చి.

బీడీ నోట్లో ఉంచుకునే, రాత్రి పణికేటట్టు నవ్వాడు.

ఆ కాస్తపాటి వెలుగులో ఆశ్చర్యంతో అతని ముఖం చూచాను.

చెప్పడం ప్రారంభించాడు–

"మొదటిసారి నేనూ విస్తుపోయిన సందర్భం ఇదే. చావు అంత సలభమూ అనిపించింది. సీతప్పన్న పెళ్ళాన్ని బలంగా కొట్టాడు. నేను వెళ్ళేసరికి చచ్చిపోయింది!"

మళ్ళా నవ్వాడు.

అసంకల్పితంగా జరిగిన ఆ సంఘటనపట్ల సానుభూతి కంటె ఆశ్చర్యం, అంతకుమించి చావుపట్ల చులకనతనం కనిపించి నిర్ఘాంతపోయాను.

"ఇక పోనా మరి?"

"దగ్గర్లోనే యిల్లు–వస్తారా ఓసారి? మీకో మంచి విచిత్రం చూపిస్తాను"

మనస్సులో ఏవో శక్తులు ఎదురు తిరుగుతున్నా, మాటల్లో, చేతల్లో, మనిషి తీరులో – పరస్పరం వైరుధ్యంగల కాంతం నాకు తెలియకుండానే నన్ను ఆకర్షిస్తున్నాడు.

నా ఆకలిని కనిపెట్టి అరటిపళ్ళు కొని తెచ్చాడు. 'పద' అన్నాను.

మూడు మలుపులు తిప్పి మరీ బురదగా వున్న ప్రాంతానికి తీసుకొచ్చాను. చుట్టూ పూరిగుడిసెల మధ్య ఓ గుడ్డిదీపం ముందు ఆపి "కాస్త వంగి లోపలికి రండి" అన్నాడు.

రానురాను వాసన దుర్భరమయింది. ఎవరన్నా చూస్తే బావుండదేమోనన్న పిరికితనం, ఏవిధంగానూ గర్వించలేని యిలాంటి మిత్రుడితో స్నేహంపై అలక్ష్యం, లోపల్లోపల కృంగదీస్తున్నా నిశ్శబ్దంగా లోపలికి వచ్చాను.

ఊదొత్తులు వెలిగిస్తే గదంతా మట్టి కలిసిన చవకబారు సువాసన వ్యాపించింది. బయట ఎలావున్నా గదంతా శుభ్రంగా వుంచాడు లక్ష్మీకాంతం. మనిషికంటే పరిసరాల్ని

శుభ్రంగా వుంచుకునే అలవాటు బాగానే ఉందనిపించింది. నాట్య భంగిమలో ఉన్న ఏవో పేరు తెలీని చిత్రాలు, నల్లటిరంగుల డిజైన్ల పటాలూ— వింతగా అలంకరించాడు గదిని.

గది మధ్య పులితోలు పరిచి 'కూర్చోండి' అన్నాడు. గదికంతటికీ పెద్ద ఆకర్షణ — ఆ పులి చర్మమే ననిపించింది. కూచొని అతనేం చెప్తాడోనని ఆతృతతో చూశాను. బల్లమీద రెండు కాగితాలు తీసి నేలమీద కూచున్నాడు.

"ఈ కథ మీకు చూపిస్తే బావుణ్నని నిన్నే హఠాత్తుగా తోచింది. మొదటిసారి చదువుకొని నాకు నేనే సిగ్గుపడ్డాను. ఎలా రాయాలో నాకేం తెలీదు మరి"—

ఆగకుండా గడగడా చదివేశాడు.

ఉక్కిరిబిక్కిరయి వింటూ కూచున్నాను. సంస్కారంలేని వ్యక్తిలో ఆలోచనలు జలపాతం ఎత్తునుండి దుమికినట్టు ఎంత ఉధృతంగా వుంటాయో కథ వింటున్నంతసేపూ తెలిసి వచ్చింది.

ఎన్నాళ్ళో లక్ష్మీకాంతంలో దాగిఉన్న సంఘర్షణ, మాటలకి అందని భావాలూ, అంతర్ విప్లవం, పొత్తు కుదరని ఆలోచనలూ—అద్భుతమైన సింబాలిజమ్‌తో— తనకు తెలీకుండానే ఓ విశిష్టమైన పంథాలో రచన సాగించాడు. ఇంకా ఆకారం దాల్చని చిత్తు స్వరూపం లాగా, అర్థం కోసం పెనుగులాడుతున్న మనస్సు ఆ కథ వెనుక కన్పించింది.

అంతవరకు ఆ మురికి మనిషిమీద, అతని అలక్ష్యం మీద ఏమైనా దురభిప్రాయాలూ, చిన్న చూపూ ఉంటే అవన్నీ ఆ క్షణంలో తుడిచి పెట్టుకుపోయాయి. కథ చదువుతున్నంతసేపూ ఎంత విశ్వాసంతో, ప్రతిభావం ఎంత అనుభవించి వ్రాశాడో అర్థమయింది.

దానిని కథగా పరిగణించక పోవచ్చు ఎవరూనూ. కాని కాంతాన్ని లోకానికి పరిచయం చేసి ఆయన నిత్య కార్యక్రమాన్ని విశదపరిచి, అతని చిత్రాలన్నీ పత్రికలో ప్రకటించి, క్రింద ఈ కథ వేస్తే ప్రతి పాఠకుడూ దిగ్భ్రమ చెందుతాడు—

కథ సంక్షిప్తంగా యిది—

కీడు తలపెట్టడం అంటూ తెలీని ఆడమేక ఒకటి ఉంటుంది. ప్రపంచాన్ని నిర్లక్ష్యంగా చూస్తూ "వీళ్ళకి కీడు తలపెట్టడంలో మన కాలాన్ని ఎందుకు వృథా చేసుకోవాలి?" అనుకొంటుంది. అయితే మిగతా జంతువులు దానినలా బ్రతకనివ్వవు. తిరగబడతాయి. తన పిల్లల్ని బాధ పెడతాయి. ఏం చెయ్యాలో తోచక, తన కోపాన్ని ఎవరిమీదా ప్రదర్శించలేని ఆ ఆడమేక తన కన్న కొడుకుని చంపేసి దూరంగా తోసేస్తుంది మరోమార్గం తెలీక. చుట్టూ ఉన్న జంతువులన్నీ తెల్లబోతాయి ఈ దారుణ హత్యకు. కోపంతో అరుస్తాయి. చచ్చిపోయిన మొగ మేకపై సానుభూతి చూపుతాయి. "కన్న కొడుకును చంపావా పాతకీ!" అని ఏక కంఠంతో అరుస్తాయి. కోపం వచ్చి ఆ జంతు రాజ్యంలోంచి ఆ మేక, ఆమె సంతానాన్ని వెలివేస్తాయి. అప్పటినుంచీ ఆ కుటుంబం జోలికి ఏ జంతువులూ రావు. అయితే కన్న

కొడుకును చంపానన్న ఆ బాధతో, ఎవరితోనూ చెప్పుకోలేక మనసులోనే కృంగి, క్షీణించి ఆ మేక ఓరోజు చచ్చిపోతుంది–

ఇదీ కథ.

అంతా చదివి నావేపు చూసి నేను తెల్లబోవడం చూసి ఫకాలున నవ్వేశాడు "చింపేస్తానండీ! ఇది చెత్త కథ. ఎవరికీ చూపడానికి నాకిష్టం లేదు. అంతా పిచ్చి" అని చింపి వేయబోతే అతని చేతిలోంచి లాక్కొన్నాను.

నవ్వుతున్న అతని ముఖాన్ని ఏదో విగ్రహాన్ని చూస్తున్నట్టు చూస్తున్నాను.

"బాగులేదు. నిజమేనా?" అన్నాడు.

"నన్ను పంపవూ? దారి తెలీదు" అని లేచేను అతని ప్రశ్నకు సమాధానం చెప్పకుండా.

ఇంకేమీ మాట్లాడలేదు లక్ష్మీకాంతం. నేనింకా అరటి పళ్ళు తిననేలేదు. మళ్ళీ రోడ్డుమీదకు తెచ్చి వదిలేసేడు.

"ఎవరికీ చూపకండీ దాన్ని. చదివి చించెయ్యండి" అనేసి వెళ్ళిపోయాడు.

ఆ రెండు కాగితాలనూ పట్టుకొని పన్నెండు గంటల రాత్రిలో ఒంటరిగా నడిచాను– "నా చేతిలో ఒక జీవితపు సంఘర్షణ, ఒక హృదయంలోని ప్రళయం, ఒక మనస్సుకి వ్యుత్పత్తి ఉన్నదని ఇప్పుడాలోచిస్తే అనిపిస్తుంది.

* * * * *

చదువు పూర్తయ్యాక ఆ వూరునుంచి వచ్చేశాను. ఎప్పుడన్నా కాంతాన్ని కలిసినప్పుడల్లా పలకరించేవాణ్ని. కాని ఒకటి రెండుసార్లు తప్ప అతను కలవలేదు. ఊరు విడిచి పెట్టాక అసలు గుర్తులేకుండా పోయాడు లక్ష్మీకాంతం.

ఏణ్నర్థం తర్వాత ఓరోజు రైల్లో వస్తూంటే ఆ వూరు నుంచి వస్తున్న పాత మిత్రుడు తటస్థపడ్డాడు.

మాట్లాడుతూంటే మధ్యలో లక్ష్మీకాంతం ప్రసక్తి వచ్చింది.

"వాడా! వాడికి పిచ్చెక్కింది" అన్నాడు మిత్రుడు మామూలుగా

దిమ్మెర పోయాను! "ఎందుకని?" అన్నాను ఆతృతతో.

"ఎవరో మలబారు అమ్మాయిని తీసుకొచ్చాడు. బావుంటుందిలే–'రమణి' పేరు. అందరూ వద్దంటే ఎదురు తిరిగాడు. 'నా బ్రతుకు నన్ను బ్రకతనివ్వండి' అంటాడు. ఊరంతా వాడికి వ్యతిరేకులయారు. చివరికి పబ్లిక్ ప్రాసిక్యూటర్ రంగధామరావుగారు ఓ బహిరం సభలో వాడిని ప్రత్యేకంగా తిట్టి, అటువంటి జాతిద్రోహుల్ని వెలి వెయ్యాలన్నారు. సభలో వాడూ ఉన్నాడు. నవ్వాడు ఆ మాటలు విని. అప్పట్నుంచీ వాడిని వెలివేశారు. అయినా విచారించలేదు లక్ష్మీకాంతం. మతి చెడిందన్నారు అంతా కలిసి"

ఇది విన్నాక మరీ ఆశ్చర్యం కలిగింది. పాత కథ గుర్తుకొచ్చింది. పబ్లిక్ ప్రాసిక్యూటరుగారికి

ఈ విషయంలో ఏం జోక్యం?- ఒక్కసారి మలబారు అమ్మాయినీ, కాంతాన్ని చూస్తే బావుణ్ణనిపించింది. అయినా అక్కడ నాకేం పనిలేదు. అదీగాక నేనిప్పుడు ఉద్యోగంలో వున్నాను. ఆ ఆసక్తి అలానే నిలిచిపోయింది.

సమస్యలతోపాటు, విషయాలు పాతపడ్డాయి. కాలం నన్నూ, పరిస్థితులనూ మార్చింది. అబ్బో! ఒకటా, రెండా?- ఆరేళ్ళు గడిచిపోయాయి.

ఉద్యోగరీత్యా చిత్తూరు వచ్చాను. విజయవాడనుంచి బయల్దేరి చిత్తూరుకు పోతూంటే దుఃఖం వచ్చింది - ఏవో నిధుల్ని వదులుకు పోతున్నట్టూ, విజయవాడే సుఖానికి పరాకాష్ట అయినట్టూ. తీరా చూస్తే చిత్తూరే మెరుగనిపించింది! బాగులేకపోయినా తప్పదు. ఉద్యోగం ఉద్యోగమే.

రచయితగా నలుగురి ముందుకూ వచ్చాను. గొప్పతనాన్ని వయస్సుకు ముడిపెట్టిన వాళ్ళంతా నన్ను చూసి తుళ్ళిపడినా, తటస్థులలో విచక్షణ గలవారు విస్తుపోయి చూడక తప్పలేదు. నన్ను నేను గుర్తించుకుని ఆశయాలను పెంచుకునే రోజులవి.

పాత అనుభవాలను ముందుకు లాగి, వయస్సు నేర్పిన పాఠాలతో కొత్త అర్థం యివ్వడానికి ప్రయత్నిస్తున్నాను. ఆ ప్రయత్నంలో మళ్ళీ లక్ష్మీకాంతం ముందుకు వచ్చాడు. వొళ్ళు ఝల్లుమంది. అప్పటి కథ కోసం పుస్తకాలన్నీ గాలిస్తే-ముందు వెనుకలు లేని చిత్తు ప్రతి - ఆడమేక కొడుకుని చంపిన ఘట్టం-కనిపించింది!

కొన్ని నిజాలు ఎంత బరువుగా, ఎంత నగ్నంగా ఉంటాయంటే ఊహకు ముడిపెట్టి వాటి ముగింపును తెలుసుకోవడం కష్టం అవుతుంది. ప్రయత్నించినా లక్ష్మీకాంతం కథకు ముగింపును ఊహించలేక పోయాను. ఇప్పుడెలా ఉంటాడా అని ఆలోచించాను.

లక్ష్మీకాంతాన్ని ఊరంతా వెలివేయడం, మలబారు అమ్మాయి-అన్నీ గుర్తుకొచ్చాయి. అయినా ప్రయత్నాలకి లొంగని జిజ్ఞాస అలానే మిగిలిపోయింది.

ముగింపులేని కథగా దాన్ని ప్రచురించాలని అనిపించినా ధైర్యం లేక దానినలాగే వుంచేశాను.

******

ఉన్నట్టుండి పాకాల పాఠశాల వార్షికోత్సవానికి ఆహ్వానం వచ్చింది. రచయిత వ్యాసంగానికి అగ్నిపరీక్ష ఉపన్యాసం. రచయితను పూర్తిగా చదవలేని వ్యక్తి, ఉపన్యాసంలో చేతకాని తనాన్ని వెదికి సంతృప్తిపడతాడు. ఉపన్యాసంలో ఆకర్షించగల రచయిత రచనలో ఆకర్షించ లేకపోవచ్చు. రెండూ వేర్వేరు విషయాలు. రచయితని ఉపన్యసించమనడం దేవుడికి ఆడిట్ ఎకౌంట్లు పని యివ్వడం లాంటిది.

ఏమైనా కీర్తిమీద దుగ్ధ చావలేదు. రచయిత కీర్తితో వ్యాసంగాన్ని ప్రారంభించి అసంతృప్తితో పెనుగులాడి, నిరాశతో అధ్యాయాన్ని ముగిస్తాడు. ఉపన్యసించడానికి

సరేనన్నాను. నిజానికి ఉపన్యసించడమంత తేలికయిన పని మరొకటి లేదు. అందువల్లనే మంచి ఉపన్యాసకుడు మంచి రాజకీయ వేత్తగా–అక్కర్లేకపోయినా అయి కూచుంటాడు.

సభ అయాక, స్టేజీ దిగుతూంటే నాలుగేళ్ళ కుర్రాణ్ని ఎత్తుకొని లక్ష్మీకాంతం కన్పించేసరికి నిర్ఘాంతపోయాను. నన్ను చూస్తూనే నవ్వాడు– మళ్ళీ పాత నవ్వు–

ఎప్పుడో మరిచిపోయిన పాత మిత్రుడు కనిపించగానే హఠాత్తుగా, నాకు తెలియకుండానే గుండె వణికింది. ఒక్కసారి అభిమానంతో రెండు చేతులూ పుచ్చుకొన్నాను.

"వస్తారా! యింటికి వెళ్దాం" అన్నాడు. మరింకేమీ మాట్లాడలేదు.

అందర్నీ వదిలించుకొని కాంతంతో నడిచాను. ఊరికి ఎడంగావున్న సన్నని దారి వెంట కొండలవేపు నడిచాడు.

"బావున్నారా?" అన్నాడు అందర్నీ దాటగానే.

అప్పటికీ యిప్పటికీ చాలా మారిపోయిన లక్ష్మీకాంతాన్నే యింకా నివ్వెరపాటుతో చూస్తున్నాను నేను. తెల్లటి గ్లాస్కో పంచె, ఎరుపు గీతల లాల్చీ, బ్రేస్‌లెట్స్‌తో లాల్చీతో ఉన్న కుర్రాడూ – అంతా విచిత్రంగా ఉంది నాకు.

"ఈ కుర్రాడెవరు?"

నవ్వేడు–"మా వాడు"

చెట్లవేపు చూస్తూ చప్పట్లు చరుస్తున్నాడు. కళ్ళు మాత్రం కాంతాన్ని గుర్తుకు తెస్తున్నాయి. మిగతా ముఖమంతా మరెవరిదో పోలిక. నాజూకుగా, కోమలంగా, పల్చగావున్న స్త్రీ స్వరూపం కళ్ళకు కట్టినట్లయింది. క్షణంలో మలబారు అమ్మాయి గుర్తుకొచ్చింది.

అతన్నడగాల్సిన ప్రశ్నలు వరసగా తోసుకు వస్తున్నాయి. అన్నిటినీ అణుచుకుని అతన్ని విచిత్రంగా చూస్తూ నడుస్తున్నాను.

"మూడేళ్ళకిందటే ఆవూరు వదిలేశాను. మీరు వెళ్ళిన సంవత్సరమే నన్ను వెలివేశారు. విన్నారుగా?" అన్నాడు.

"ఎందుకని!" –తెలిసినా అడిగాను.

కొడుకిని చూపించి "ఇందుకు" అన్నాడు. అర్థం తెలిసి నవ్వాను.

"ఓ మలబారు అమ్మాయి తమాషాగా తటస్థపడింది. పెళ్ళి చేసుకున్నాను. ఆమెకెవరూ లేరంది. అందుకని జాలేసి పెళ్ళి చేసుకున్నాను. ఇంకా విచిత్రం ఏమిటంటే ఆమెకు తెలుగు రాదు–ఇప్పటికీను".

తెల్లబోయాను.

"అదొక్కటే మా యిద్దరి సుఖానికీ కారణం. నన్ను అర్థం చేసుకొంటుంది. ఎక్కువగా మాట్లాడదు. నేను చేసిన సహాయానికి కృతజ్ఞత నిరంతరం కళ్ళతో చూపిస్తుంది. వీడు–వీడు 'చక్రవర్తి'– కాస్త తెలుగూ, కాస్త మళయాళం మాట్లాడుతాడు" ఆప్యాయంగా దగ్గరికి తీసుకొని ముద్దు పెట్టుకున్నాడు.

ఇంటిముందు వెదురు తడికతో గేటు వుంది. తోసుకు లోపలికి వస్తే సన్నజాజుల పందిరి కింద నల్లటి సిల్కు చీర కనిపించింది. ఆ చీకటి మధ్య అంతగా గుర్తు పట్టలేకపోయినా సన్నటి పొడవు వ్యక్తి అని తెలిసింది.

అందంకంటే, అమాయకత పాలు పెంచుకొని- నాజూకు తనంలో, పల్చని పెదాలలో, సన్నని ముక్కులో, నొక్కుపడిన చిన్న నుదురులో - అందాన్ని దాచుకున్న దంతపు బొమ్మలాగ కనిపించింది.

'రమణి' అని పరిచయం చేశాడు కాంతం.

పిరికిగా పారిపోలేదు రమణి. స్థిమితంగా కళ్ళల్లోకి చూసి నమస్కారం చేసింది. ఆ నిశ్చలత కదిలించింది నన్ను. సన్నజాజుల్ని నోటితో వూది నుదుటికి కొట్టుకుంటున్నాడు కుర్రాడు.

ఆ చెల్ల చల్లదనం కింద కూచుని-కాంతం, కుర్రాడు, రమణిని చూస్తూ ఏమీ అడగాలనిపించలేదు నాకు. నిశ్శబ్దంగా కూచున్నాను.

అంత సుఖాన్ని, అంత స్వేచ్ఛని, ఆ ఆనందాన్ని భరించలేని వాళ్ళంతా వీరిని వదులుకొని సంతృప్తిపడ్డారు. వారిని వెలివేయడం వల్ల అక్కడ మిగతా వాళ్ళేం బాగుపడ్డారో, వీళ్ళేవిధంగా చెడిపోయారో అర్థం కాలేదు. లక్ష్మీకాంతాన్ని చూస్తుంటే 'వెలి' మీద గౌరవం పెరిగిపోయింది. అది ఓ అమూల్యమైన వరం. లక్ష్మీకాంతంలాంటి ఏ అర్హత గలవారికో ఆ అదృష్టం లభిస్తుందనిపించింది.

"అప్పటి నా పిచ్చితనం గుర్తుందా మీకు?" అనడిగాడు లక్ష్మీకాంతం ఉన్నట్టుండి.

అర్థం తెలియక చూశాను.

"నా కథ" నవ్వాడు సిగ్గుపడుతూ.

"ఉంది. రెండు కాగితాలు మాత్రం చినిగిపోయాయి" బిగ్గరగా నవ్వి సగం తెలుగులో, సగం మళయాళంలో రమణికేదో చెప్పాడు. ఆమె నవ్వింది-కళ్ళనిండా తృప్తి తెచ్చుకుని.

ఇంటినీ, భార్యనీ చూస్తే కాంతంలో మార్పుకి అర్థం తెలిసివచ్చింది. గోడలకి అప్పటి పెయింటింగులూ, నాట్య భంగిమ చిత్రాలూ ఉన్నా, యింకా దేవుడి పటాలూ, ఎప్పుడో యిద్దరూ చెట్టాపట్టాలేసుకొని తీయించుకొన్న బొమ్మలూ, కుర్రాడి ఎన్‌లార్జిమెంటూ కనిపించాయి.

ఆ రాత్రి ఉండిపోయానక్కడే.

ఒక్కటిమాత్రం తెలిసింది.

ప్రపంచానికి సరిపోయేటట్టు సుఖాల్ని కుదించుకు బ్రతికేవాడికంటే ప్రపంచాన్ని మరిచిపోయి బ్రతకడం మంచిదని - అయితే అంతా లక్ష్మీకాంతాలు కాలేరేమో! ఈ ఒక్క ఉదాహరణతో జనరలైజ్ చెయ్యలేం. ఏమైనా లక్ష్మీకాంతం హాయిగా బ్రతుకుతున్నాడు.

మర్నాడు వెళ్ళబోతూ అదే అడిగాను.

"హాయిగా బ్రతుకుతున్నావా?"

నవ్వాడు– భార్యకు బోధపరచి చెప్పి మళ్ళీ నవ్వాడు! కాస్సేపటికి నావేపు తిరిగి "బ్రతకడానికి జీవితం చాలా చిన్న అవకాశం. ఇంకా బ్రతకడం నేర్చుకొంటున్నాను"

* * * *

మరొక్కసారే లక్ష్మీకాంతాన్ని కలిశాను.అదే చివరిసారి–

మూడేళ్ళతర్వాత మా ఆవిడ మేనమామగారిని మదనపల్లి శానిటోరియంలో ఉంచారంటే వెళ్ళాను.

రాత్రంతా ట్రావెలర్స్ బంగళాలో ఉన్నాను. ప్యూన్ ఉదయాన్నే మమ్మల్ని తీసుకువెళ్ళడానికి వచ్చాడు. మా ఆవిడ మామగారు డి.ఎస్.పి పని చేస్తుండగా టి.బి వచ్చి స్పెషల్ ఎగ్జంప్షన్‌తో రిటైర్ అవడానికి ఏడాది ఉండగానే చార్జీ యిచ్చేశారు. మేము వచ్చేసరికి అతని పిల్లలు, మనవలూ అంతా వచ్చేశారు.

వయస్సులో బాగా బ్రతికిన మనిషేమో, వచ్చిన రోగం గడ్డుదయినా యింకా మృత్యువుతో తగాదా పడుతూనే ఉన్నాడు. అందరితోపాటు సానుభూతి పలకడం, ఫలితం తెలుస్తూండగానే సముదాయించడం చేతకాక వసారాలోకి వచ్చి నిలబడ్డాను. వార్డు నర్సులంతా ఎవరి పనిపాటలు వాళ్ళు చేసుకుంటున్నారు. మంచానికి చేరబడి మా ఆవిడ కళ్ళనీళ్ళు కారుస్తోంది. ఏడవడం తెలీని మనవలంతా నిలబడి విచిత్రంగా చూస్తున్నారు. ఎదురుగ్గా అపరేషన్ రూము కనిపిస్తోంది.

ఉన్నట్టుండి పక్కకి తప్పుకొమ్మని ఓ నర్సు పిలిస్తే వెనక్కు తిరిగాను. ఇద్దరు నర్సులు స్ట్రెచర్‌తో ఎవరో పేషెంటును తీసుకొచ్చి ఆపరేషన్ థియేటరు ముందు దింపి లోపల ఖాళీ ఉందో లేదో చూడడానికి వెళ్ళారు.

ఉదయపు ఎండ భరించరానిదిగా ఉంది. స్ట్రెచర్ మీద సగం ఎండపడితే పేషెంటు మూలుగుతున్నాడు. ఏం చెయ్యాలో తోచక, ఎండకు అడ్డంగా అటువేపు తిరిగి నిలబడ్డాను.

హఠాత్తుగా రమణి, కొడుకుతోసహా అక్కడ కనిపించింది. ఇద్దర్నీ చూస్తూనే నివ్వెరపోయాను నేను.

స్ట్రెచర్‌లో పడుకొన్న పేషెంటు పక్కనే కూచొంది రమణి. నన్ను చూసి గుర్తుపట్టలేక పోయింది.

ఆమెను చూడగానే మతిపోయిందినాకు. ఆత్రుతగా స్ట్రెచర్‌లో ఉన్న వ్యక్తి ఎవరా అని వెదికాను. మరోనిముషానికి గుర్తుపట్టి స్తంభించిపోయాను.

లక్ష్మీకాంతం మూలుగుతూ కనిపించాడు. అప్పుడే తెలివొచ్చినట్టుంది–ఏదో అస్పష్టంగా భార్యతో గొణుగుతున్నాడు.

కిందికి వంగి నన్ను నేను పరిచయం చేసుకొంటే, పోలిక పట్టి పేలవంగా నవ్వాడు.

నవ్వులో పాత అనుభూతి గుర్తులేదు. కాలం మింగేసిన మనస్సు, నవ్వుని మలిన పరచి, ఏదో వికృతరూపాన్ని మిగిల్చింది.

మళ్ళీ పాత ప్రశ్న వేశాడు:

"బావున్నారా?"

జవాబు చెప్పలేక పోయాను.

లోపల బెడ్ ఖాళీ చెయ్యడానికి నర్సులు హడావిడిగా తిరుగుతున్నారు.

కొద్దికొద్దిగా నేర్చుకున్న తెలుగులో ఏదో చెప్తోంది. కుర్రాడు మఠం వేసుకుని స్ట్రెచర్ పక్కనే కూచొన్నాడు.

నర్సులు వచ్చేలోగా అవకాశం చూసుకుని ఒకే మాట అన్నాడు లక్ష్మీకాంతం–

"మీరడిగేవారుగా – ఎలా బ్రతుకుతున్నావని?–ఇన్నాళ్ళూ బ్రతకడం నేర్చుకుంటున్నాను– ఇప్పుడిక బ్రతకడం ప్రారంభిస్తాను"

చిన్న పిల్లాడిలాగ దుఃఖం పొర్లుకొచ్చింది నాకు.

స్ట్రెచర్‌ను ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకు వెళ్ళడానికి నర్సులు వచ్చారు. రమణి నిశ్శబ్దంగా ఏడుస్తోంది. లక్ష్మీకాంతం బలహీనంగా నవ్వుతూ కొడుకువేపు చూస్తూనే వున్నాడు.

స్ట్రెచర్‌తో లోనికి వెళ్ళిపోయాడు లక్ష్మీకాంతం.

అంతే. మళ్ళీ బయటికి రాలేదు.

– యువ